# ప్రేమ పెళ్లిని ఇష్టపడే ఆమె అతడ్ని ఎందుకు వద్దంది?

# అవకాశవాది

సెంపరి
కథ

"డియర్ లల్లీ, వరుసగా ఇది నా ఆరో ఉత్తరం. ఇంతకుముందు నేను వ్రాసిన ఐదు ప్రేమలేఖలకీ నుంచి జవాబు రాలేదు. ఏం? కోపమా? అలకా? అంత తప్పు నేనేం చేశానని? ఒకవేళ ఏదైనా తప్పుంటే ఈ దాసుడికి కఠినమైన శిక్ష విధించి దండించవచ్చుగా?

పొద్దస్తమానూ గుంజీలు తీయమంటావా? సాయంత్రం వరకూ గోడకుర్చీ వేయమంటావా? సొమ్మసిల్లేవరకూ ఆగకుండా పరుగెత్తమంటావా? నీ ఇష్టం. ఎలాంటి శిక్ష విధించినా సంతోషంగా భరిస్తాను. శిక్షేమిటో తెలియజేస్తూ ఉత్తరం వ్రాయి. నేనిక్కడ తు.చ తప్పకుండా అమలుపరుస్తాను.


నీవు విధించిన కఠోరమైన శిక్షకూడా నాకెంతో ఆనందాన్నిస్తుందన్న సంగతి మరచిపోవద్దు.

కానీ డియర్, నా ఉత్తరాలకి జవాబు వ్రాయకుండా మాత్రం నన్ను శిక్షించవద్దు. అది నేను భరించలేను.

సుకుమారమైన నీ చేతివేళ్ల మధ్యనుండి పొందికగా జాలువారిన ముత్యాల వరుసల్ని పదేపదే చదువుకుంటూ, తదేకంగా చూసుకుంటూ తన్మయత్వాన్ని పొందే భాగ్యాన్ని నాకు దూరం చేయవద్దు."

వ్రాయడం ఆపుచేసి, సిగరెట్ పీకె ఆఖరిదమ్ము లాగి అవతల పడేసి తలగోక్కున్నాడు మురళి. తర్వాత ఎలా కొనసాగించాలో వెంటనే తట్టలేదు. అంతవరకూ వ్రాసినది ఒకసారి చదివి చూసుకున్నాడు. బాగానే ఉన్నట్టనిపించింది.

మురళికి లలితతో పరిచయమై సరిగ్గా ఆరు



నెలలవుతోంది. అప్పట్నుంచి ఆమె పొందు కోసం ఒకటే తహతహలాడిపోతున్నాడు.

పెద్దవాళ్లేమో అతనికోసం యుద్ధప్రాతి పదిక మీద వెతుకుతున్నారు — పెళ్లి సంబంధాలు! ఏమాత్రం ఆలస్యం చేసినా అతను ఏ ప్రేమ మైకంలోనో పడిపోవడం, గుళ్లో పెళ్లిచేసుకుని రావడం, ఏ కులం తక్కువదో అతన్ని ఎగరేసుకుపోవడం,

రెండు లక్షలకు తక్కువకాని కట్నం డబ్బుకి నీళ్లొదులుకోవలసిరావడం... ఇలాంటి ప్రమాదాలెన్నో వుండడంవల్ల సాధ్యమైనంత త్వరగా కొడుకు పెళ్లి చేసేద్దామని ఆరాటపడుతున్నారు వాళ్లు.

లలిత విషయం అతను తన పెద్దవాళ్ల దగ్గర చూచాయగా కూడా ఎప్పుడూ ప్రస్తావించలేదు. ఎందుకంటే అలా చేయడానికి మూడు కారణాలు అడ్డుపడుతున్నాయి. ఒకటి — లలిత తల్లిదండ్రులు కట్నం ఇచ్చుకోలేరు. రెండు లలితవాళ్లది కొంచెం తక్కువ కులం. మూడు — అన్నిటికన్నా ముఖ్యంగా లలితను పెళ్లిచేసుకోవడం అతనికే ఇష్టం లేదు. పువ్వులున్నవి వాసనచూసి పారేయడానికే తప్ప కలకాలం దాచుకోవడానికి కాదని అతని అభిప్రాయం. అయితే పారేయడానికి అని ముందే చెపితే ఏ పువ్వూ తనని వాసన చూడనివ్వదుకనుక — ఈ ప్రేమ నాటకం!

అతని ప్రేమడ్రామా ఫలించబోతున్న తరుణంలో లలిత కంప్యూటర్ డిప్లొమా కోర్స్ చేయడానికి హైదరాబాద్ వెళ్లిపోయింది. అన్నా వదినెల దగ్గరుండి చదువుకుంటోంది. వెళ్లేముందు ఇన్‌స్టిట్యూట్ అడ్రస్ ఇచ్చి వెళ్లడంచేత అక్కడికే వ్రాస్తున్నాడు ప్రేమలేఖలన్నీ. లలిత వెళ్లి ఇప్పటికి నాలుగు నెలలైంది. ఈ నాలుగునెలల్లోనూ అతను ఐదు సుదీర్ఘమైన ప్రేమలేఖలు వ్రాశాడు. ఒక్క దానికీ సమాధానం లేకపోయినా.

ఆమె అక్కడ వుందా లేదా? వుంటే తన లేఖలు ఆమెకు అందుతున్నాయా లేదా? అన్న విషయం అతనికి అంతుపట్టడంలేదు.

అనుకున్నది సాధించడంలో అతను పట్టువదలని విక్రమార్కుడు. మరో రెండు నెలల్లో ఆమె డిప్లొమా పూర్తిచేసి రాబోతోంది. ఈ లోగా ఆమె మనసును లోబరచుకోవాలి. అందుకే ఆమెనుంచి సమాధానం లేకపోయినా విక్రమార్కుడిలా ఇంకా ప్రేమలేఖలు వ్రాస్తూనే వున్నాడు. మాటల్లో చెప్పలేనిది లేఖల్లో వ్యక్తపరచడానికి వీలవుతుంది కాబట్టి ఆమె దూరంగా వెళ్లడం తన అదృష్టంగానే భావించాడు.

బుర్ర చురుకుగా పనిచేయడంకోసం మరో సిగరెట్ వెలిగించి దమ్ములాగుతూ వ్రాయడం కొనసాగించాడు.

"కలలోకూడా నీ రూపమే కళ్లముందు కదలాడుతుంటే, ఓ నా స్వప్నసుందరీ, విరహవేదనతో నా తనువు, మనసూ కృంగి కృశించిపోతున్నాయి. ఇంకొక్క క్షణంకూడా నిన్ను చూడకుండా వుండలేననిపిస్తోందంటే బహుశా నువ్వు నమ్మవేమో. ఇంకా రెండు నెలలు గడపాలంటేనే ఏదో దిగులు మేఘంలా కమ్ముకొస్తోంది. ఒక్కొక్క క్షణం ఒక్కొక్క యుగంలా గడుపుతూ నీ రాక కోసం యుగాల్ని లెక్కపెట్టుకుంటూ బతుకుతున్నాను.

నా ప్రేమజ్యోతీ, కలల రాణీ, నీ 'కరుణా కటాక్షమే' శరణ్యంగా బతుకుతున్న ఈ దీనుడిని కరుణించి ఏలవా? ఓ దివ్య రమణీ, నా ప్రేమ కుసుమాన్ని నీ పాదాలచెంత వుంచి మొక్కే ఈ భక్తుడి ప్రార్థన ఆలకించి నీయొక్క అనుగ్రహాన్ని ప్రసాదించి నన్ను ధన్యుణ్ణి చేస్తావన్న ఆశతోనే ఇంకా బతుకుతున్నాను. ఈసారైనా జవాబు వ్రాయకపోతే ఉరేసుకుని చచ్చిపోవా

అని గట్టిగా నిశ్చయించుకున్నాను. నా ప్రాణాలు నీ గుప్పెట్లో వుంచుతున్నాను. ఆ పైన నీ ఇష్టం..."

ఉత్తరం ముగించి గెడ్డం గోక్కుంటూ చివరి వాక్యాన్ని మళ్లీ ఒకసారి చదివి చూసుకున్నాడు. అవతలి వ్యక్తి మనసుమీద అది చాలా బలంగా పనిచేస్తుందని ఊహించాడు. ఈసారి ఆరునూరైనా, నూరు ఆరైనా జవాబు రావడం తథ్యం అని దృఢంగా నమ్ముతూ పోస్ట్ చేశాడా వుత్తరాన్ని.

అతనూహించినట్టే వారం రోజులకల్లా ఆమెనుంచి జవాబు వచ్చింది. ఆనందంతో గబగబా కవరు విప్పి చదవసాగాడు.

"మురళీ,

డియర్ మురళీ అని సంబోధిస్తే నిన్ను ప్రేమిస్తున్నట్టు ఎక్కడ భ్రమపడతావోనని ముందే జాగ్రత్తపడి 'మురళీ' అని మొదలు పెట్టాను. గ్రహించగలవు..."

చదువుతున్న మురళి ఉలిక్కిపడ్డాడు. అతని కనుబొమలు ముడుచుకున్నాయి.

"నీ ప్రేమలేఖలన్నీ అందాయి. నాపట్ల నీకున్న గాఢమైన ప్రేమని ఆ ఉత్తరాల్లో రంగరించి వ్రాశావు. చాలా సంతోషం.

మామూలుగా అయితే ఆ ఉత్తరాలు చదివిన ఏ ఆడపిల్లయినా ఇట్టే మైకంలో పడిపోతుంది. అంత బాగున్నాయవి. అయితే అదంతా పాతరోజులనాటి సంగతి. పైపై మాటలకే ఉబ్బి తబ్బిబ్బయి అమ్మాయిలు బోల్తా పడేరోజులు పోయాయి మురళీ. ప్రపంచం ఎప్పుడూ ఒకలాగే వుండదు. అనుక్షణం అది అభివృద్ధి చెందుతూ వుంటుంది. దానితోపాటే మనుషుల దృక్పథాలూ మారుతూ వుంటాయి. మారుతూన్న ప్రపంచంలో, మీ మగవాళ్లంత కాకపోయినా, మేమూ కాస్తో కూస్తో తెలివితేటలు పెంచుకుంటున్నాము.

మొదటిసారి ఉత్తరంలో నువ్వుచూపించిన ప్రగాఢమైన ప్రేమకు నా మనసు నిజంగానే పరవళ్లు తొక్కింది. ఆ రోజంతా తీయని స్వప్నాల్లో తేలిపోయాను. హృదయం



,రివిప్పిన మయూరమైంది. నీ మనసులో ,న్నదంతా నిజమైన ప్రేమే అయితే ఈ పపంచంలో నా అంత అదృష్టవంతురాలు ,రెవరూ వుండరేమో!

అయితే అది నిజమైన ప్రేమ అవునో 'దో ఎవరికి తెలుసు?!

ప్రతి విషయాన్నీ అనుమానించి, రక కాలుగా తర్కించుకుని, అనుమాన నివృత్తి సుకోవడంద్వారా సత్యాన్వేషణ సాగిస్తూ 'వడాన్ని 'శాస్త్రీయ పద్ధతి' అంటారట. పేమ ఎంతో ఉత్కృష్టమైనది. మనుషులు ిసి బతకడానికి ఎన్నో కారణాలుండవచ్చు . కానీ మనసులు కలిసి బతకడానికి మాత్రం ఒక్క ప్రేమే కారణం! అంత పవిత్రమైన ప్రేమని గుడ్డిగా నమ్మే బదులు దానికి కూడా శాస్త్రీయ పద్ధతిలో 'గీటు ఎందుకు పెట్టకూడదు? అని నాలో నేనే ప్రశ్నించుకున్నాను.

అందుకే నువ్వు వ్రాసిన ఉత్తరాన్ని 'గ్రాఫోగైడ్' అనేసంస్థకి పంపి 'విశ్లేషణ' కావాలని కోరాను. చేతివ్రాతనుబట్టి ఒక వ్యక్తి మనస్తత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ విశ్లేషించి వివరించే సంస్థ ఒకటి 'గ్రాఫోగైడ్' అనే పేరుతో వెలిసిందిక్కడ. ఒక వ్యక్తి గుణగణాలేమిటో అతని దస్తూరిలో వెల్లడైపోతాయన్న సంగతి బహుశా నీకు కూడా తెలిసే వుంటుంది.

నీ ఉత్తరంలోని దస్తూరిని విశ్లేషించి వాళ్లు పంపిన 'రిపోర్ట్' చదివాను.

దాని ప్రకారం నువ్వొక అవకాశవాదివని తేలింది. ఉన్నదానితో సంతృప్తి పడకుండా లేనిదానికోసం అర్రులు చాచే వింత మనస్తత్వమట నీది. సమస్య ఎదురైనప్పుడు దాన్ని ధైర్యంగా ఎదుర్కొని తెలివిగా పరిష్కరించుకునే విజ్ఞతపాలు నీలో చాలా తక్కువట. అలాంటి సమయాల్లో నువ్వు 'గోడమీది పిల్లి'వాటాన్ని అవలంబిస్తావట.

విభిన్న రుచులకోసం పరుగులు తీసే గుణం నీది. ఏరు దాటాక తెప్ప తగలెయ్యడానికి ఏమాత్రం సంకోచించవు. జీవితంలో ఇంకా ఇంకా ఎదగాలనే తాపత్రయం నీకు చాలా ఎక్కువ. అఫ్‌కోర్స్. అది మంచిదే. కానీ అందుకోసం అడ్డదారులు తప్ప వేరే ఏ మార్గమూ వెదకవట. ఇది ఎంతమాత్రం మంచిదికాదు. ఇన్ని చెడ్డగుణాలున్న నిన్ను ఎలా ప్రేమించమంటావు? ప్రేమించి నా బతుకును ఎలానాశనం చేసుకోమంటావు? అందుకే మురళీ, అయామ్ సారీ. రిస్క్ తీసుకోలేను.

పోనీ 'గ్రాఫోగైడ్'వాళ్ల విశ్లేషణ తప్పయి వుండొచ్చుకదాని (నిజం చెప్పాలంటే తప్పయి వుండాలని ఆశిస్తూ) ఎందుకైనా మంచిదని అదే వుత్తరాన్ని మరో నాలుగైదు అలాంటివే సంస్థలకి పంపాను. కొంచెం అటూ ఇటుగా వాళ్ళు పంపిన రిపోర్టులుకూడా అలాగే వున్నాయి. ఆ ఒక్క ఉత్తరమేకాదు మురళీ. నువ్వు వ్రాసిన ఐదు ఉత్తరాలూ కాపీలు తీయించి అన్ని సంస్థలకీ పంపి రిపోర్టులు తెప్పించాను. కొట్టొచ్చినట్టు అన్ని ఉత్తరాలకీ, అన్ని సంస్థలనుంచి వచ్చిన విశ్లేషణా ఇంచుమించు ఒకేలా వున్నాయి. అన్నింటిలోనూ ఒక విషయం స్పష్టంగా వుంది.

సమయం వచ్చినప్పుడు క్షేమంగా తప్పిం

చుకుపోయే అవకాశవాదివి నీవు!

నీ మనస్తత్వాన్ని విశ్లేషించడానికి నేనెంత డబ్బు ఖర్చుచేయాల్సివస్తోందో చూసావుగా? ఇదంతా ఎందుకో తెలుసా? ఆడదానికి ఏవిధమైన రక్షణా లేని సమాజంలో బ్రతుకుతున్న ఒక స్త్రీగా నా జాగ్రత్త నేను తీసుకుంటున్నాను. నాకు అన్నివిధాలా రక్షణ నిచ్చి, నిజాయితీగా ప్రేమించి, జీవితాన్ని స్వర్గమయం చేయగల భాగస్వామిని ఎంచుకోవడానికి ఇది నేను తీసుకుంటున్న జాగ్రత్త!

ఇకపోతే ఇప్పుడు నువ్వు వ్రాసిన ఆరో ఉత్తరాన్ని నేనే విశ్లేషించి గ్రహించినదేమిటో తెలుసా? నన్ను సంబోధించడానికి నా పేరుకాక మరో నాలుగు పేర్లు వాడావు. అవి సుందరీ, జ్యోతీ, రాణీ, రమణీ. ఎందుకో తెలీదుకానీ, నాకది నచ్చలేదు. చక్కనైన నా పేరు వుండగా నన్ను సంబోధించడానికి అన్ని పేర్లు ఎందుకు ఉపయోగించాల్సి వచ్చిందో నాకు అర్థంకాలేదు.

ఇంతవరకూ ఏ మనస్తత్వవేత్తయినా కనిపెట్టాడో లేదోగానీ, అనేకమంది స్త్రీలమీద వ్యామోహం పెంచుకోగలవాడే అలా వేర్వేరు పేర్లు కలిపి సంభోధిస్తాడని నా మనసుకి బలంగా తోస్తోంది.

నీ లేఖలో నాకు అతిశయోక్తులే ఎక్కువ కనిపించాయి. సిన్సియారిటీకన్నా పైత్య ప్రకోపమే ఎక్కువ ధ్వనించింది. 'బహుశా నువ్వు నమ్మలేవేమో' అని వ్రాశావు. నేను నమ్ముతానో లేదోనని అప్పుడే నామీద అపనమ్మకమన్నమాట. మాట హృదయాంతరాళాల్లోంచి వచ్చినదైతే మనం నమ్మకూడదనుకున్నా నమ్మకమేర్పడుతుంది.

మరో ముఖ్యమైన విషయమేమిటంటే, నా కరుణాకటాక్షమే నీకు శరణ్యమన్నావు. నాయొక్క అనుగ్రహాన్ని ప్రసాదించమన్నావు. కరుణాకటాక్షం, అనుగ్రహం అన్న రెండుపదాల్నీ అవసరం లేకపోయినా ఇన్వర్టెడ్ కామాల్లో వ్రాశావు. అంటే ఆ మాటల్ని వ్రాస్తున్నప్పుడు వాటి నిజార్థాల్నికాక వేరే అర్థాన్ని దృష్టిలో పెట్టుకుని వ్రాశావని స్పష్టంగా తెలిసిపోతూంది.

పై కారణాలన్నింటివల్ల నీ ప్రేమలో నిజాయితీ లేదని భావిస్తూ నిరాకరిస్తున్నందుకు నన్ను క్షమించి దయచేసి నన్ను మరచిపో మురళీ గుడ్‌బై.

ఇట్లు
నీదికాని
లలిత

◇ ◆ ◇

ఉత్తరం చదవడం పూర్తయ్యాక కళ్లు గిర్రున తిరిగినట్టయింది మురళికి. కసికొద్దీ ఉత్తరాన్ని నలిపి నేలకేసి విసిరికొట్టాడు.

"ఒరేయ్, అమలాపురంలో మంచి సంబంధముంది. రెండు లక్షల కట్నం, ఆరు తులాల బంగారం పెట్టి, ఎకరం కొబ్బరితోటకూడా రాసిస్తారట. ఎప్పుడెళ్దాం?" అంటూ లోపలికి దూసుకువస్తున్న వ్యక్తిని వారించి —

"మామయ్యా, ఇవాళే వెళ్దాం. ప్రయాణపు ఏర్పాట్లు చూడు" అన్నాడు అవకాశవాది మురళి.